

KADILIMCHE VAARTHA Telugu daily
కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 241 సోమవారం 31 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar

# ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



- ఆ ఒక్క చోట మాత్రం పోస్ట్ పోన్
- రాజస్థాన్‌లో పరీక్షకు విద్యుత్ అంతరాయం
- సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించిన పరీక్ష
- 2 కేంద్రాల్లో నిలిచిన పరీక్ష- అభ్యర్థుల ఆందోళన



## భారత్- ఉజ్బెకిస్థాన్ ట్రేడ్ డీల్

- యురేనియం సరఫరా, యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు
- 5 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం!
- భారత్- ఉజ్బెకిస్థాన్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం
- 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యం
- భారత్‌కు యురేనియం సరఫరా, ఉజ్బెకిస్థాన్‌లో యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర



- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం: సీఎం చంద్రబాబు ట్వీట్
- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం

**అమరావతి**

మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు.

## సహాయక చర్యలు ముమ్మరం

- నేపాల్ ఆకస్మిక వరదలు
- రంగంలోకి దిగిన భారత రెస్క్యూ బృందాలు
- 788కు చేరిన మృతులు.. మొత్తంగా 2,500 మందికి పైగా గల్లంతు
- కొనసాగుతున్న సహాయక చర్యలు





## డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

- దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయ్
- పీఎం స్వనిధి లబ్దిదారుల్లో 46 శాతం మంది మహిళలే ఉన్నారు
- దేశ యువతులు కలలు భూమిని దాటి స్పేస్‌లోకి దూసుకెళ్తున్నాయి
- విదేశాల్లోనూ త్రివర్ణపతాకం రెపరెపలాడింది
- మన్ కీ బాత్ ప్రసంగంలో మోదీ వెల్లడి



# విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి



- రేపు ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్
- విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి
- సోమవారం శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి
- వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఇప్పుడు విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం - మిగతా3లో



## రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది అదే!

- ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించకపోవడం విచారకరం
- సుప్రీంకోర్టులో జడ్జీల నియామకాలపై న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కీలక వ్యాఖ్యలు
- ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సూచన

# ఇక క్రాస్ వాల్యుయేషన్!

- 1 నుంచి 10వ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కీలక మార్పులు..
- రాష్ట్ర తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల మూల్యాంకన విధానంలో కీలక మార్పు
- జవాబు పత్రాలను ఇకపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కాకుండా ఇతర స్కూళ్ల టీచర్లతో క్రాస్ వాల్యుయేషన్ చేయించనున్నారు..
- మండల కేంద్రాల్లో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లు

**హైదరాబాద్**

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు విద్యార్థుల ప్రతిభను నిష్పక్షపాతంగా అంచనా వేయడమే లక్ష్యంగా కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల -1, -2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు - మిగతా3లో

## రష్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

- పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగానే అటాక్?!
- గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో తిరిగి పునరుద్ధరించిన రష్యా
- కీవ్‌పై రష్యా దాడి చేయడంతో పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన గిడ్డంగిలో అగ్నిప్రమాదం
- ఇప్పటివరకు 38మంది మృతి



# ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

నీట్ పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. అయితే, రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు.

విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్ చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు నగరాల్లోని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం కలిగిందని ఆరోపిస్తూ, సీతాపురలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. "నేను పరీక్ష రాయడానికి ఇక్కడికి వచ్చాను. పరీక్ష మొదలవ్వకముందే సిస్టమ్ పదేపదే ఆగిపోతూ వచ్చింది. రెండు నిమిషాలు పనిచేసి, ఆ తర్వాత ఆగిపోయింది. ఇలా కనీసం 20 సార్లు జరిగింది. కొద్ది సేపటికి పనిచేస్తుందేమోనని అనుకున్నాం. కానీ అది పనిచేయలేదు" అని విష్ణు శర్మ అనే అభ్యర్థి ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్ద భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నప్పుడు, దేశంలోనే అతిపెద్ద పరీక్షల్లో ఒకటైన దీనికి సరైన సదుపాయాలను కల్పించలేరా? అని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పరీక్షను కేవలం తమ కేంద్రంలోనే మళ్లీ నిర్వహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని రద్దు చేసి దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్? చేశారు.



**'విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం'**

మరోవైపు, ఈ ఘటనపై పోలీసు అధికారి లలిత్ శర్మ స్పందించారు. "సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడం వల్లే పరీక్ష సజావుగా సాగలేదని తెలుస్తోంది. కొందరి కంప్యూటర్లు పనిచేయగా మరికొందరివి పనిచేయకపోవడంతో పరీక్షకు అంతరాయం కలిగింది. పరీక్ష, నిర్వహణ తీరుపై విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం వారితో చర్చిస్తూ, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ విషయం గురించి పరీక్ష నిర్వహణ సంస్థతో ఉన్నతాధికార స్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నాయి" అని తెలిపారు.

**నీట్ యూజీ పేపర్‌లీక్ వివాదం**

ఇదిలా ఉండగా, 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) మే 3న పెన్-అండ్-పేపర్ విధానంలో నిర్వహించిన నీట్ యూజీ 2026, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేశారు. అనంతరం, జూన్ 21న రీ టెస్ట్ నిర్వహించారు. అయితే పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఫలితంగా కొంత మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించారు. పరీక్షలో సంస్కరణలు తీసుకొస్తామని ప్రభుత్వం పేర్కొంది. పేపర్‌లీక్‌లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది. పరీక్షలో సంస్కరణలు తీసుకొస్తామని ప్రభుత్వం పేర్కొంది. పేపర్‌లీక్‌లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది.

# ఇక క్రాస్ వాల్యుయేషన్ !

-మొదటిపేజీ తరువాయి

10వ తరగతి సా-1 పరీక్షల జవాబు పత్రాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయరు. వాటి స్థానంలో ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించనున్నారు. ఈ విధా నాన్ని క్రాస్ వాల్యుయేషన్‌గా పిలుస్తారు. దీనివల్ల విద్యా ర్థుల జవాబు పత్రాల మూల్యాంకనంలో పక్షపాతం లేకుండా మరిం త పారదర్శకత తీసుకురావచ్చని విద్యాశాఖ భావిస్తోంది.

**మండల కేంద్రాల్లో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లు**

క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ఈ కేంద్రాలు మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లో పనిచేయనున్నాయి. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఈ కేంద్రాలకు కేటాయించి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను నిర్వహించనున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సరిగ్గా గుర్తించేందుకు పరీక్షల ఫలితాలు కీలకం. అయితే అదే పాఠశాల ఉపాధ్యాయులు తమ విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం వల్ల కొన్నిసార్లు మార్కుల విషయంలో తేడాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించడం ద్వారా విద్యార్థుల అసలైన విద్యా సామర్థ్యాలను మరింత నిష్పక్షపాతంగా అంచనా వేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

**పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం**

కొత్త విధానం ద్వారా పరీక్షల మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు ఉపాధ్యాయుల్లో జవాబు దారీతనం కూడా పెరుగుతుందని విద్యాశాఖ పేర్కొంది. అలాగే విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి అవసరమైన చోట అదనపు బోధన, రెమెడియల్ కార్యక్రమాలను చేపట్టేందుకు ఈ మూల్యాంకన ఫలితాలు ఉపయోగపడనున్నాయి. మొత్తంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు పరీక్షల మూల్యాంకనాన్ని మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మార్చే దిశగా ఈ క్రాస్ వాల్యుయేషన్ విధానం కీలక అడుగుగా నిలవనుంది. పాటు పరీక్షల మూల్యాంకనాన్ని మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మార్చే దిశగా ఈ క్రాస్ వాల్యుయేషన్ విధానం కీలక అడుగుగా నిలవనుంది.



## రేకుల షెడ్లకు రూ.కోట్ల ధాన్యం కేటాయింపు - అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపి ప్రభుత్వాదాయానికి గండి!

రాష్ట్రంలో రైస్ మిల్లర్ల నుంచి రూ.వేల కోట్ల విలువైన ధాన్యం, సీఎంఆర్ బకాయిల వసూళ్ల వ్యవహారం కీలక మలుపులు తిరుగుతోంది. 5 వారాల నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సోదాలు నిర్వహిస్తూ దర్యాప్తు ముమ్మరం చేస్తోంది. పౌర సరఫరాల శాఖ ఫిర్యాదులతో ఎగవేతకు పాల్పడిన మిల్లర్లపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు. తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ రంగంలోకి దిగింది. నిజామాబాద్ జిల్లాలో మిల్లులకు సంబంధించి విచారణ ప్రారంభించగా, తాజాగా వనపర్తి జిల్లాకు చెందిన 3 రైస్‌మిల్లుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**రూ.12 కోట్లు చెల్లించాలని ఫిర్యాదు**

పెద్దపల్లి జిల్లా మంథనిలోని పవనసుత రైస్ మిల్లుకు పౌర సరఫరాల శాఖ అధికారులు 5,798 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. కేటాయించిన ధాన్యాన్ని మరాడించి, బియ్యంగా ఇవ్వలేదని పౌర సరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు 2 రోజుల కిందట పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ మిల్లుకు 5,789 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగిస్తే, 3,900 మెట్రిక్ టన్నుల బియ్యం రావాలి. కానీ 1,069 మెట్రిక్ టన్నుల బియ్యమే వచ్చింది. బకాయి, జరిమానా కలిపి రూ.12 కోట్లు చెల్లించాలని పౌర సరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 10 లారీల ధాన్యం నిల్వ ఉంచే సామర్థ్యం లేని ఈ చిన్న మిల్లుకు అధికారులు వందల లారీల ధాన్యాన్ని ఏ ప్రాతిపదికన కేటాయించారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. అధికారుల మిలాఖత్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**సీఎంఆర్ బకాయిలపై సర్కార్ నజర్**

మంథని మండలంలోని ఓ రైస్ మిల్లు యజమాని రూ.10 కోట్ల సీఎంఆర్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రభుత్వం ఆ మిల్లును డిఫాల్టర్?గా ప్రకటించింది. దీంతో ఆయన పవనసుత మిల్లును లీజుకు తీసుకుని ఆ మిల్లు పేరిట ధాన్యం కేటాయింపజేసుకుని ఆ ధాన్యాన్ని పాత మిల్లుకు తరలించి బియ్యంగా మార్చారని తెలుస్తోంది. కానీ ఆ బియ్యాన్ని కూడా ప్రభుత్వానికి అప్పగించలేదు. ఈ వ్యవహారంలో బడా రైస్ మిల్లు యజమాని సహా అధికారుల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని అక్రమాలకు పాల్పడినా ఢిఫాల్డర్ అయిన మిల్లు యజమానిని పక్కన పెట్టి, సహ భాగస్వామిపై మాత్రమే పోలీసులు ఫిర్యాదు చేయడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. రూ.3,983 కోట్లు చెల్లించాలి : ఇలా పౌర సరఫరాల శాఖ చేపట్టిన విజిలెన్స్ తనిఖీల్లో రైస్ మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. చాలా మంది మిల్లర్ల దగ్గర ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యం లేదు. సీఎంఆర్?గా ఇవాల్సిన బియ్యం ఇవ్వలేదు. తనిఖీలకు వెళుతున్న అధికారులకు డబ్బులు చెల్లిస్తామని, అది కూడా వెంటనే కాకుండా సమయం కావాలని పలువురు మిల్లర్లు కోరుతున్నారు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి వేలం ధాన్యం డబ్బులు మిల్లర్లు రూ.3,983 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు వసూలైంది దాదాపు రూ.1,000 కోట్లే. మిగతా రూ.2,983 కోట్లు ఎటు వెళ్లాయో అన్నది కీలకంగా మారింది. డబ్బు పెట్టుబడుల రూపంలోకి మారిందా? ఎవరి పేరుతో పెట్టుబడులున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోట్ల అక్రమాలపై ఈడీ దర్యాప్తు : 2018 నుంచి అన్ని సీజన్లకు సంబంధించి అత్యధిక బకాయిలు ఉన్న టాప్-20 మిల్లర్ల జాబితాను పౌర సరఫరాలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు రూపొందించాయి. ఇవే వివరాలు ఈడీకి చేరినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించినవిగా భావిస్తున్న మిల్లుల్లో జరిగిన రూ.కోట్ల అక్రమాలపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో ఎక్కువ బకాయిలు ఉన్న మిల్లర్ల వ్యవహారంపైనా ఈడీ దృష్టి పెట్టి వివరాలు సేకరించినట్లు సమాచారం.

**మిల్లర్ల అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్**

అత్యధిక బకాయిలున్న టాప్-20 మిల్లర్లలో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో ఆరుగురు ఉన్నారు. నల్గొండలో నలుగురు, వనపర్తి జిల్లాలో ముగ్గురు, ఇతర జిల్లాల్లో మిగతా వాళ్లు ఉన్నారు. ఈ 20 మంది మిల్లర్ల నుంచే రూ.752.12 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. మిల్లర్ల అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించగా, తాజాగా ఈడీ రంగప్రవేశం సంచలనంగా మారుతోంది. మిల్లర్ల అక్రమాల తీవ్రతను పౌర సరఫరాల శాఖ వివరిస్తూ పోలీస్? శాఖ ద్వారా పీడీ యాక్టుతో జైలుకు పంపిస్తోంది. కొందరు మిల్లర్లు రూ.కోట్ల బకాయిలు చెల్లించకుండా జైలుకు వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి పౌర సరఫరాల శాఖ ఆర్?ఆర్? యాక్టును ప్రయోగిస్తోంది. ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే ఐదుగురు మిల్లర్లకు ఆర్?ఆర్ యాక్టు కింద నోటీసులు జారీ చేసింది. రెండు మిల్లులు కేసముద్రం, మిగతావి కురవి, ఎల్లంపేట, అప్పరాజుపల్లె కేంద్రంగా వ్యాపారం చేస్తున్నాయి. వీరి నుంచి రూ.55 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయి. అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపి ప్రభుత్వాదాయానికి గండి కొట్టినట్లుగా తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ సాగితే అసలు సూత్రధారులు ఎవరో బయటపడే అవకాశం ఉంది. ఎల్లంపేట, అప్పరాజుపల్లె కేంద్రంగా వ్యాపారం చేస్తున్నాయి. వీరి నుంచి రూ.55 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయి. అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపి ప్రభుత్వాదాయానికి గండి కొట్టినట్లుగా తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ సాగితే అసలు సూత్రధారులు ఎవరో బయటపడే అవకాశం ఉంది.

## విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

-మొదటిపేజీ తరువాయి

గణనీయంగా తగ్గనుంది. విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

**ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక**

విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

**పరిశోధన, శిక్షణకు పెద్దపీట**

వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు...

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం?బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు. హరీష్‌ను పార్టీకి దూరం చేయగలిగితే, మళ్లీ కేసీఆర్ మనసు గెలుచుకుని, అవసరమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను తన వేదికతో విలీనం చేసి రీ-ఎంట్రీ ఇవ్వవచ్చనే ఆలోచన కూడా ఆమెలో ఉండి ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కవిత వేస్తున్న ఈ పావులు ఎంతవరకు పారుతాయనేది సందేహాస్పదమే. హరీష్ రావు దశాబ్దాలుగా గ్రౌండ్ లెవెల్ రాజకీయాలు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో నిర్మించిన నాయకుడు. కవిత చేసే క్షుద్రపూజల ఆరోపణలను సామాన్య ప్రజలు లేదా తీవ్రస్థాయి గులాబీ కేడర్ ఎంతవరకు నమ్ముతారనేది ప్రశ్నార్థకం. పైగా కేటీఆర్ కూడా ప్రస్తుతానికి హరీష్‌తో కలిసే ప్రతిపక్ష పోరాటం చేస్తున్నారు. ఒకవేళ కవిత అనుకున్నట్లుగా హరీష్ రావుపై ఈ ఆరోపణలు పనిచేసి, ఆయన బీఆర్ఎస్‌కు దూరమైతే అది కవిత తెలంగాణ రక్షణ సేన కు రాజకీయంగా ఊపిరి పోస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇది ఉమ్మడి మెదక్, వరంగల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసి, కాంగ్రెస్ లేదా బీజేపీలకు మేలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఏది ఏమైనా కవిత-హరీష్ మధ్య జరుగుతున్న ఈ సమరం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని ఊహించని మలుపులకు దారితీయనుంది.

## వారసులొస్తున్నారు.....

**విజయవాడ :** ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు. భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు.

# ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

## - మానవత సమావేశంలో వక్తలు

పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 30ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని" మానవత" సమావేశంలో పలువురు వక్తలు సూచించారు. పులివెందుల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం స్థానిక గీతా మందిరంలో కార్యదర్శి బి. గురు ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కెనరా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఏ. రామచంద్రారెడ్డి , ఇంగ్లీష్ అకాడమీ డైరెక్టర్ బి. మైసూరా రెడ్డి లు మాట్లాడుతూ మానవత సంస్థ ప్రజలకు దగ్గరగా వెళ్లి సామాజిక సేవా కార్యక్రమాలను మరింతగా చేపట్టాలని కోరారు. తాను 15 సంవత్సరాలు వేతనం లేకుండా వృద్ధాశ్రమ నిర్వహణను చేపట్టినట్లు రామచంద్రారెడ్డి తెలిపారు. మానవత అధ్యక్షులు చెవ్వ కృష్ణారెడ్డి, కార్యదర్శి గురు ప్రసాద్, కోశాధికారి బి. హరిచంద్రారెడ్డిలు మాట్లాడుతూ మానవత చేపట్టిన కార్యక్రమాలను, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వారు తెలియజేశారు. విద్యార్థుల్లో మానవీయ విలువలు, రక్తదాన శిబిరం, శాంతి ర్యాలీలను నిర్వహించిన తీరును గురించి వివరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు బజజి. చంద్రశేఖర్ రెడ్డి , సభ్యుడు రామాంజనేయ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సంస్థ అధ్యక్షులు ముమ్మెల రాజు లు కూడా మాట్లాడారు. నేత్రదానం ప్రాముఖ్యతను గురించి సమావేశంలో రాజు సభ్యులకు వివరించారు. అనంతరం నేత్రదానానికి సంబంధించిన పోస్టర్లను మానవత సభ్యులచే



ఆవిష్కరింప చేశారు. రిటైర్డ్ జే టి ఓ రామిరెడ్డి ఆలాపించిన ప్రార్ధనాగీతముతో సమావేశం ప్రారంభమైంది. హాజరైన సభ్యులకు అల్పాహారాన్ని రిటైర్డ్ ఈ ఈ గంగిరెడ్డి వితరణగా ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆహ్వానితులు, పెన్షనర్ల సంఘ అధ్యక్షులు ఏవి గోపాల్ రెడ్డి తోపాటు మానవత కుటుంబ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# బైకు అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



సింహాద్రిపురం క్రైమ్ కదిలించే వార్త ఆగస్టు 30

సింహాద్రిపురం మండల పరిధిలోని అంకాలమ్మగూడూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పులివెందుల (బలపనూరు) వైపు నుంచి అంకాలమ్మగూడూరు వైపునకు వెళ్తున్న ఓ ఆటో వెనుకనే సదరు వ్యక్తి వేగంగా బైక్‌పై వస్తున్నాడు. రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఉండటంతో ఆటో డ్రైవర్ వాహనాన్ని నెమ్మదిస్తూ ఎడమ వైపునకు తిప్పాడు.గమనించిన బైక్ చోదకుడు ఎడమ వైపు నుంచి ఆటోను ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించాడు.ఆ క్రమంలో రోడ్డుపై ఉన్న గుంత,ఆటోను ఒకేసారి చూసి ఆందోళనతో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బైక్ స్కిడ్ అయి పక్కనే ఉన్న రాళ్లపై పడిపోయింది.ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# ఘనంగా ముగిసిన భాగవత సప్తహ పఠనామ



వీరపు నాయనపల్లి కదిలించే వార్త ఆగస్టు 30 వీరపు నాయనపల్లి శ్రీ రామా స్వామి ఆలయంలో వారం రోజులు గా నిర్వ హిస్తున్న భాగవత సప్తహ పఠనం ఆదివారం ఘనంగాముగిసింది. ఆదివారం పఠనంఅనంతరం ఏడు రోజులపాటు ఏడు మంత్రాలను మంత్రపుష్పం పేరిట జపములునిర్వ హించారు. మహిళలుఆలయం చుట్టూ ఓం నమోభగవతే వాసు దేవాయ మంత్రం కలశ ప్రదర్శనంచేసారు. ఈ సందర్భంగా వక్తలు మాటలాడుతూ ఒకప్పుడు జిల్లాకు బాంబులగడ్డగా పేరుండేదనియనినేడు భాగవతం గడ్డగా పల్లే పల్లి లో భాగవతంపఠనం పేరిట ఆధ్యాత్మికకుసుమాలు విరాజిల్లు తున్నా యని వక్తలు కొనియాడారు.



ఆరు కిలో మీటర్ల దూరం లోనిసంగ మేశ్వర దేవస్థానం సమీపం నదిలో భాగవతపండితులు అవబృత స్నానాలు నిర్వ హించారు.సరోజమ్మ కుమార్తె అల్లుడు రామ ప్రసాదరెడ్డి దంపతులు భాగవత పండితులకు ఘన సత్కారం నిర్వ హించారు.ఈ సందర్భంగా నిర్వ హ కులుఏడు రోజుల పాటు ఆల్పరం అన్నప్రసాదం వితరణ చేసిన దాతలకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సమాజం అధ్యక్షులు నారాయణరెడ్డి ఉపాధ్యక్షులు గంగిరెడ్డినిర్వ హకులు రాధమ్మ సరోజమ్మ రాయలసీమ భాగవత భక్త సమాజం కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి దర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రిసెప్షన్ వేడుకల్లో భూమి రెడ్డి ఉమాదేవి



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 30

పులివెందుల లోని మిట్టా సుబ్బకృష్ణ వారి సాయి కిషన్ నేహాల

రిసెప్షన్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి .ఈ రిసెప్షన్ వేడుకలకు మిట్ట వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి హాజరై నూతన వధూవరులు సాయి కిషన్ ఢ నేహ లను ఆశీర్వదించడం జరిగింది. అనంతరం రిసెప్షన్ వేడుకల్లో భూమిరెడ్డి ఉమాదేవిని పలువురు ఆప్యాయంగా పలకరించగా వారితో కొంత సమయం కేటాయించి రిసెప్షన్ వేడుకల్లో గడిపారు. ఈ కార్యక్రమంలో మిట్ట వారి కుటుంబ సభ్యులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతోనే అంధరహిత సమాజ నిర్మాణం సాధ్యం



పులివెందుల,కదిలించే వార్త

ఆగస్టు 30:పులివెందుల పట్టణం లోని గీత మందిరం లో నిర్వహించిన మానవతా స్వచ్ఛంద సంస్థ నెల వారి సమావేశంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రసేకరణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మనవతా స్వచ్ఛందం సంస్థ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు మాట్లాడుతూ అంధత్వ నిర్మూలనకు నేత్రదానం అత్యంత గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. మరణానంతరం దానం చేసే రెండు నేత్రాలు ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపగలవని తెలిపారు. నేత్రదానం చేసేందుకు 9966509364 కి సంప్రదించి సమాజంలోని ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులను కూడా



నేత్రదానానికి ప్రోత్సహించాలని కోరారు. అంధరహిత సమాజ నిర్మాణం ప్రభుత్వాలు లేదా సంస్థల వల్ల మాత్రమే సాధ్యం కాదని, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు, దాతలు అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో మానవతా స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సేవాభావం కలిగిన దాతలు నేత్రదాన ఉద్యమానికి తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా జీవితాలకు వెలుగునిచ్చే అవకాశం లభిస్తుందని, ప్రతి కుటుంబం నేత్రదాన ప్రతిజ్ఞ చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మానవత అధ్యక్షులు కృష్ణారెడ్డి, కెనరా బ్యాంక్ విశ్రాంత మేనేజర్ రామచంద్రారెడ్డి , ఇంగ్లీష్ అకాడమీ డైరెక్టర్ మైసూరా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కోశాధికారి హరిచంద్రారెడ్డి, కార్యదర్శి గురు ప్రసాద్,జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రశేఖర్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, విశ్రాంత ఈ ఈ గంగిరెడ్డి, పెన్షనర్ల సంఘ అధ్యక్షులు ఏవి గోపాల్ రెడ్డి, విశ్రాంత జే టి ఓ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోరిన కోరికలు తీర్చే అంకాలమ్మ తల్లికి విశేష పూజలు

## - ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి




పులివెందుల అర్బన్ కదిలించే వార్త ఆగస్టు 30 పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి శ్రావణమాసం ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు.అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పవిత్ర క్షేత్రాల్లోనైనా ప్లాస్టిక్ భూతానికి చెక్ పెట్టాలి!

## -గండి దేవస్థానం నుంచే ప్లాస్టిక్ రహిత మార్పుకు శ్రీకారం చుట్టాలి

## -గర్భగుడి వైపు కూడా ప్లాస్టిక్ కవర్లు.. పాపాఘ్ని నదిలోకి చేరుతున్న వ్యర్థాలు.. అధికారుల దృష్టి సారించాలంటున్న భక్తులు



వేంపల్లె ఆగస్టు 30 (కదిలించే వార్త): శ్రావణమాసం సందర్భంగా ప్రసిద్ధ గండి శ్రీ వీరాంజనేయస్వామి క్షేత్రానికి భక్తుల రాక భారీగా పెరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు గండి క్షేత్రానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు ఆకట్టుకుంటున్నాయి. క్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు అవసరమైన వసతులు కల్పించేందుకు అధికారులు చేస్తున్న కృషి అభినందనీయం.అయితే.. ఇంతటి పవిత్రమైన క్షేత్రంలో ప్లాస్టిక్ వినియోగం మాత్రం ఆందోళన కలిగించే స్థాయిలో కొనసాగుతుండటం భక్తులను కలవరపెడుతోంది. శ్రావణమాసం ప్రారంభమై మూడు వారాలు గడిచినా దేవస్థాన పరిసరాలతో పాటు భక్తులు సంచరించే ప్రాంతాల్లో, చివరకు గర్భగుడి వైపు కూడా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.స్వామివారి దర్శనానికి భక్తులు పంచెకట్టుతో, సంప్రదాయ దుస్తులతో రావాలని అధికారులు సూచిస్తున్న నేపథ్యంలో.. అదే స్థాయిలో దేవస్థాన పవిత్రతను కాపాడేందుకు ప్లాస్టిక్ నియంత్రణపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.గండి క్షేత్రం పక్కనే ప్రవహించే పవిత్ర పాపాఘ్ని నది భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలతో ముడిపడి ఉంది. అలాంటి పవిత్ర నదిలోకి ప్లాస్టిక్ కవర్లు, ప్యాకింగ్ వ్యర్థాలు, ఇతర చెత్త చేరడం ఆందోళన కలిగించే విషయం.దేవస్థాన పరిసరాల్లో, నది తీరంలో పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షాలు, వరదల సమయంలో నదిలోకి చేరే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ ముక్కలు, కవర్లు నీటిలో కలవడంతో నది పర్యావరణ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉంది.పవిత్రమైన పాపాఘ్ని నదిని కలుషితం చేసి.. అదే నీటిని మనం వినియోగిస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? అనే ప్రశ్న ప్రతి ఒక్కరిలోనూ తలెత్తాల్సిన అవసరం ఉంది.కలుషిత నీటిని వినియోగించడం వల్ల నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, అంటువ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా శ్రావణమాసంలో గండికి వచ్చే చిన్నారులు, వృద్ధులు, మహిళలు, ఇతర భక్తుల ఆరోగ్యంపై అపరిశుభ్ర వాతావరణం ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.అందువల్ల పాపాఘ్ని నది పరిరక్షణ కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు.. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశం కూడా.మన హిందూ సంప్రదాయంలో దేవాలయ దర్శనానికి ఎన్నో ఆచారాలు, నియమ నిబంధనలు ఉన్నాయి. పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, పవిత్రతను పాటించడం, పూజా విధానాలను గౌరవించడం వంటి సంప్రదాయాలను భక్తులు తరతరాలుగా పాటిస్తున్నారు.అయితే కాలానుగుణంగా మారుతున్న



జీవనశైలిలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. చేతిలో చిన్న ప్లాస్టిక్ కవర్‌తో మొదలైన అలవాటు నేడు దేవాలయాల ప్రాంగణాలను, నదీ తీరాలను సైతం ఆక్రమించే స్థాయికి చేరింది.దేవాలయం అంటే కేవలం భక్తులు వచ్చి వెళ్లే ప్రదేశం కాదు. అది మన సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీక. అలాంటి పవిత్ర ప్రదేశాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల వాటి ప్రభావం ఒక్కరోజుతో ముగిసిపోదు. అవి నేలలో, నీటిలో సంవత్సరాల తరబడి ఉండిపోయే ప్రమాదం ఉంది.ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలోకి చేరితే చేపలు, నీటిలోని ఇతర జీవులు వాటిని ఆహారంగా భావించి మింగే ప్రమాదం ఉంటుంది. పశువులు, పక్షులు కూడా ప్లాస్టిక్ కవర్లను తినడంతో వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.ఇలా పర్యావరణ వ్యవస్థలోని జీవజాతులపై ప్రభావం పడుతూ పోతే కాలక్రమేణా ప్రకృతి సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. చివరకు దాని ప్రభావం మళ్లీ మనుషులపైనే పడుతుంది.అందుకే ప్లాస్టిక్ నియంత్రణ అనేది కేవలం దేవస్థానం పరిశుభ్రతకు సంబంధించిన అంశంగా కాకుండా మన భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది.ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల్లో పూర్తిస్థాయిలో మార్పు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్లాస్టిక్ రహిత ఉద్యమానికి దేవాలయాలే నాంది పలికితే దాని ప్రభావం సమాజంపై బలంగా పడే అవకాశం ఉంది.గండి దేవస్థానంలోకి ప్లాస్టిక్ కవర్లను తీసుకురాకుండా క్రమంగా నిబంధనలు అమలు చేయాలి. ప్రవేశ ద్వారాల వద్ద ప్లాస్టిక్ నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు అవగాహన కల్పించాలి. పూజా సామగ్రి, ప్రసాదాలు, ఇతర వస్తువులను కాగితపు సంచులు, వస్త్ర సంచులు లేదా పర్యావరణహిత ప్యాకేజింగ్‌లో అందించే విధానాన్ని తీసుకురావాలి.దేవస్థానం అంతటా "ప్లాస్టిక్ తీసుకురావద్దు.. పాపాఘ్ని నదిని కలుషితం చేయవద్దు.. పర్యావరణాన్ని కాపాడండి" అనే సందేశాలతో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలి.ప్లాస్టిక్ నియంత్రణ బాధ్యతను కేవలం భక్తులపైనే మోపడం సరికాదు. దేవస్థాన అధికారులు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన



అవసరం ఉంది.దేవస్థానంలో ప్లాస్టిక్ వినియోగంపై స్పష్టమైన నిబంధనలు రూపొందించి, వాటి అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలి. ఒక్కరోజు లేదా ప్రత్యేక పర్వదినాల్లో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ప్లాస్టిక్ నియంత్రణను నిరంతర కార్యక్రమంగా కొనసాగించాలి.దేవస్థాన ప్రాంగణంతో పాటు పాపాఘ్ని నది పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలి. తడి, పొడి చెత్తకు వేర్వేరు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి. నదిలోకి చెత్త చేరకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి.గండి క్షేత్రం కేవలం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు.. వేలాది మంది భక్తులకు స్ఫూర్తినిచ్చే పవిత్ర ప్రదేశం. ఇక్కడ తీసుకునే ప్రతి మంచి నిర్ణయం ఇతర దేవాలయాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది."దేవుడిని దర్శించుకుందాం.. దేవాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.. పాపాఘ్ని నదిని పవిత్రంగా కాపాడుదాం" అనే నినాదంతో గండి దేవస్థానం ముందుకు సాగాలి.స్వామివారి దర్శనానికి పంచెకట్టుతో రావాలని భక్తులకు సూచిస్తున్న అధికారులు.. అదే సమయంలో ప్లాస్టిక్ రహిత గండి క్షేత్రానికి, పరిశుభ్రమైన పాపాఘ్ని నదికి భక్తులు సహకరించాలని పిలుపునివ్వాలి.భక్తులు కూడా తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ కవర్లను దేవస్థానానికి తీసుకురాకుండా, నదీ తీరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా సహకరించాలి.పవిత్రత అంటే కేవలం ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. ప్రకృతిని కాపాడటమూ పవిత్రమైన బాధ్యతే.గండి వీరాంజనేయస్వామి సన్నిధి నుంచి "ప్లాస్టిక్‌కు నో.. పాపాఘ్నికి రక్ష.. పర్యావరణానికి జై" అనే సందేశం వెలువడితే.. అది గండి క్షేత్రానికే కాకుండా యావత్ సమాజానికి

ఆదర్శంగా నిలుస్తుంది.ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టే తొలి అడుగు కనీసం దేవాలయాల నుంచైనా ప్రారంభిద్దాం.

పవిత్ర పాపాఘ్ని నదిని కాపాడుదాం.

గండి నుంచే ఆ మార్పుకు శ్రీకారం ప్రారంభిద్దాం.

# యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యం

-మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి
-ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'లో యువతకు దిశానిర్దేశం
-బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్




వేంపల్లె ఆగస్టు 30 (కదిలించే వార్త):
యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ప్రసారమైన ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' 137వ ఎపిసోడ్ దేశ ప్రజలకు స్ఫూర్తినిచ్చేలా సాగిందని ఆయన తెలిపారు.సమాజంలో మార్పు తీసుకురావడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ప్రధాని మోదీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారని హరిప్రసాద్ అన్నారు.ప్రధాని ప్రస్తావించిన 'నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం యువతకు ఎంతో కీలకమైన సందేశాన్ని అందిస్తోందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు, నషాముక్త్ భారత్ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని ప్రధాని పిలుపునిచ్చారని తెలిపారు.మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు యువత కొత్త కంటెంట్, పాటలు, నినాదాలు రూపొందించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రధాని సూచించడం అభినందనీయమన్నారు.స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా చిన్న వ్యాపారులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని హరిప్రసాద్ పేర్కొన్నారు. 'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు పీఎం స్వనిధి వంటి పథకాలు అందిస్తున్న అవకాశాలను కూడా ప్రధాని వివరించారని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు.భారతదేశ చరిత్రపై యువతలో మరింత ఆసక్తి పెంచేలా రూపొందించిన కొత్త డిజిటల్ వేదిక గురించి కూడా ప్రధాని వివరించారని హరిప్రసాద్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలను వివిధ కాలాల్లో ఎవరు పాలించారు, ఆయా ప్రాంతాల చారిత్రక నేపథ్యం ఏమిటనే అంశాలను తెలుసుకునేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని అన్నారు.రైతులకు కొత్త ఆదాయ అవకాశాలపై కూడా ప్రధాని దృష్టి సారించారని తెలిపారు. ముఖ్యంగా ఆవకాడోకు పెరుగుతున్న డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త పంటలను సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతులకు కూడా ఆవకాడో సాగు కొత్త అవకాశాలను అందించగలదని పేర్కొన్నారు.స్వచ్ఛత, సామాజిక బాధ్యత, యువత భాగస్వామ్యం, మహిళా సాధికారత, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహం, రైతులకు కొత్త అవకాశాలు వంటి అనేక అంశాలను 'మన్ కీ బాత్' ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చారని హరిప్రసాద్ అన్నారు. ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం క్రమంగా 'జన్ కీ బాత్'గా మారుతూ ప్రజా భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ నిర్మాణం సాధ్యమనే బలమైన సందేశాన్ని అందిస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, నామ ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి




వేంపల్లె ఆగస్టు 30(కదిలించే వార్త): వేంపల్లె మండల కేంద్రంలోని హనుమాన్ సర్కిల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో పులివెందుల--కడప జాతీయ రహదారిపై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించారు. నీళ్లు చల్లి స్పృహలోకి తెచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సాయంత్రం అతడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.మృతుడు గులాబీ రంగు చెక్స్ చొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్యాంటుకు ఉన్న బెల్టుపై 'సాధన హై స్కూల్ -- కే డి ఆర్' అని రాసి ఉంది. అధికంగా మద్యం సేవించడం వల్ల అస్వస్థతకు గురై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, మృతికి కారణం వైద్య పరీక్షల అనంతరం తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా ఇటీవల ఎవరైనా కనిపించకుండా పోయినట్లు తెలిసిన వారు వేంపల్లి సీఐ టీ. నరసింహులు (9121100550), ఎస్ఐ (9440938046)ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## బంటుపల్లిలో ఘనంగా "నమస్తే ఎచ్చెర్ల" కార్యక్రమం






కదిలించే వార్త:- రణస్థలం ఆగస్టు - 30,ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం లో బంటుపల్లి గ్రామంలో యువ నాయకుడు, బీఎల్ఏ--1 తేజ ఆధ్వర్యంలో "నమస్తే ఎచ్చెర్ల" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంటుపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే శ్రీ నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన "నమస్తే ఎచ్చెర్ల" కార్యక్రమంలో జిల్లా నాయకులు, నాలుగు మండలాల కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ఎన్ ఈ ఆర్ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కడప నగరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే

-కడప కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరాలి
-అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
-టిడిపి--వైకాపాలు దొందూ దొందే.. రాహుకేతువుల్లాంటివి
-డా. నర్రెడ్డి తులసిరెడ్డి




వేంపల్లె ఆగస్టు 30 (కదిలించే వార్త):
కడప నగరాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సాధ్యమైందని, రాబోయే కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.ఆదివారం వేంపల్లిలో తులసిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షుడు గౌస్ పీర్, కడప నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అంజన్ కుమార్ కలిసి రాబోయే కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో కడప మున్సిపాలిటీని 2004 నవంబర్ 17న మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రజలకు విస్తృతంగా వివరించాలని సూచించారు.కడప నగరంలో కాంగ్రెస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆయన అన్నారు. ముఖ్యంగా రిమ్స్ వైద్య కళాశాల, డెంటల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, స్పోర్ట్స్ స్కూల్, క్రికెట్ స్టేడియం, సెంట్రల్ స్కూల్, విమానాశ్రయ ఆధునికీకరణ, యోగి వేమన విశ్వవిద్యాలయం, శాటిలైట్ సిటీ, సింగపూర్ టౌన్‌షిప్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.అదేవిధంగా బుగ్గవంకపై నాలుగు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం, బుగ్గవంక సుందరీకరణ వంటి కార్యక్రమాలు కూడా కాంగ్రెస్ పాలనలో చేపట్టినవేనని తులసిరెడ్డి తెలిపారు. కేవలం అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పావలా వడ్డీ, అభయహస్తం, అమ్మహస్తం, బంగారు తల్లి వంటి సంక్షేమ పథకాలను అమలు చేశామని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా పేదలు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాలకు జరిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అన్నారు.సామాజిక న్యాయం విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయాలు తీసుకుందని ఆయన తెలిపారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్లు, బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 25 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు, ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు.టిడిపి, వైకాపాలు దొందూ దొందేనని, రాహుకేతువుల్లాంటివని తులసిరెడ్డి విమర్శించారు. వైకాపా అరచేతిలో వైకుంఠం చూపిస్తే, టిడిపి అరచేతిలో కైలాసం చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీల మధ్య జరుగుతున్నది సవతుల పోరు తప్ప ప్రజల కోసం చేసే పోరాటం కాదని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో కడప నగరానికి జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలను సమగ్రంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తే రాబోయే కడప కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీకి ప్రజల మద్దతు లభిస్తుందని తులసిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు."కడప నగర అభివృద్ధికి కాంగ్రెస్ చేసిన కృషిని ప్రజలకు వివరించి, పార్టీ విధానాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్తే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం. కడప మున్సిపల్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం" అని తులసిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# వైభవంగా శ్రీరాముని ఆలయ భూమి పూజ

బ్రహ్మంగారి మఠం కదిలించే వార్త ఆగస్టు 30 మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ చీకటివారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ రామాలయ నిర్మాణ పనులకు ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో, బి.మఠం టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమానికి కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వేద పండితుల మంత్రోచ్చారణలు, శాస్త్రోక్త పూజల నడుమ కానాల మల్లికార్జున రెడ్డి శంకుస్థాపన రాయిని ప్రతిష్ఠించి, టెంకాయ కొట్టి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెరిగినప్పుడే ప్రశాంతత సమకూరుతుందని, రూ.40 లక్షల అంచనా వ్యయంతో సర్వాంగ సుందరంగా ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రోత్సాహంతో నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్లనాటి తమ నిరీక్షణ ఫలించి రామాలయ నిర్మాణం ప్రారంభం కావడం పట్ల చీకటివారిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తజనం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గంటల్లోనే పోగొట్టుకున్న మొబైల్ రికవరీ

-బాధితురాలికి స్పాట్‌లోనే ఫోన్ అప్పగించిన వేంపల్లి పోలీసులు
-బస్టాండ్‌లో పోలీసుల ప్రత్యక్ష నిఘాపై ప్రయాణికులు, స్థానికుల హర్షం



వేంపల్లె ఆగస్టు 30 (కదిలించే వార్త):
శ్రావణమాసం సందర్భంగా గండి శ్రీ వీరాంజనేయస్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కే సమయంలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ఓ మహిళా భక్తురాలికి వేంపల్లి పోలీసులు అండగా నిలిచారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన పోలీసులు ఎంక్వయిరీ చేపట్టి మొబైల్ ఫోన్‌ను గుర్తించి స్పాట్‌లోనే బాధితురాలికి అప్పగించారు.శ్రావణమాసం కావడంతో గండి క్షేత్రానికి భక్తుల రాకపోకలు భారీగా పెరిగాయి. దీంతో వేంపల్లి బస్టాండ్ పరిసరాల్లో ప్రయాణికుల రద్దీ కూడా అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల శాంతిభద్రతల పరిరక్షణ కోసం వేంపల్లి సీఐ టి. నరసింహులు పోలీసు సిబ్బందిని బస్టాండ్‌లో విధుల్లో నియమించారు.గండి వీరాంజనేయస్వామివారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కే సమయంలో ఓ మహిళా భక్తురాలు తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. విషయం గుర్తించిన వెంటనే బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.బాధితురాలి ఫిర్యాదుపై అక్కడే విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ నిత్య పూజయా వెంటనే స్పందించారు. మొబైల్ ఫోన్ వివరాలు సేకరించి ఎంక్వయిరీ చేపట్టి, అనతికాలంలోనే ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎలాంటి ఆలస్యం చేయకుండా స్పాట్‌లోనే బాధితురాలికి మొబైల్ ఫోన్‌ను అప్పగించారు.తాను పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి లభించడంతో బాధితురాలు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను చెప్పిన వెంటనే స్పందించి, ఫోన్‌ను వెతికి పట్టుకుని తిరిగి అప్పగించడంపై అక్కడ ఉన్న ప్రయాణికులు, స్థానికులు పోలీసుల పనితీరును అభినందించారు.శ్రావణమాస రద్దీ దృష్ట్యా బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు ప్రత్యక్షంగా విధులు నిర్వహిస్తూ కనిపించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం అందుబాటులో ఉండటం వల్ల బస్టాండ్‌కు వచ్చే ప్రజల్లో భద్రతా భావన పెరుగుతోందని పలువురు పేర్కొన్నారు.ప్రజల సమస్యను తమ సమస్యగా భావించి తక్షణమే స్పందించి, పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి అందించిన వేంపల్లి పోలీసుల సేవాభావం, విధి నిర్వహణ పట్ల స్థానికులు ప్రశంసలు కురిపించారు.

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై సీపీఐ ఆగ్రహం

-దొంగ ట్రాన్స్‌ఫార్మర్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి
-జగనన్న కాలనీలో చోరీలపై స్పందించని అధికారులు
-సీపీఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్

బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 30
విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని సీపీఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ ఆరోపించారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు.ఆదివారం బ్రహ్మంగారిమఠంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, మండలంలోని పలు గ్రామాలు, ముఖ్యంగా జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పూర్తిగా లోపించిందని విమర్శించారు. జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు చోరీకి గురైనా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. విద్యుత్ శాఖలోని కొంతమంది సిబ్బందే అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వైర్లు తగిలి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా వేలాడుతున్న వైర్లను, పాడైన స్తంభాలను వెంటనే సరిచేయాలని కోరారు. చోరీకి గురైన ప్రభుత్వ ఆస్తులపై స్పష్టమైన వివరాలు బయటపెట్టి, బాధ్యులైన సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## సాగు, తాగునీటి సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 30

జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను నీటితో నింపి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కడప జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నాయకులు, రైతులతో కలిసి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టుపై విషయమై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు సాగునీరే ప్రాణాధారమని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెంచి పంటలకు సమయానుకూలంగా నీరు విడుదల చేయాలని కోరారు.

అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా నిర్వహించి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే, జిల్లాలోని పలు గ్రామాల్లో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు శాశ్వత పరిష్కార మార్గాలు అన్వేషించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎత్తపు సుబ్బారెడ్డి, భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, అన్నపురెడ్డి నారాయణరెడ్డి, నల్లపురెడ్డి ప్రశాంత్ రెడ్డి, పసుపులేటి వెంకటేష్, పుల్లలచెరువు రమేష్‌రెడ్డి, అబ్బిరెడ్డి, రాజేశ్వరరెడ్డి, యేమిరెడ్డి నరసింహారెడ్డి, ఎల్లటూరు మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నందలూరు ఏజీపీ వినయ్ కుమార్ కు ఘన సత్కారం

### - అభినందనలు తెలిపిన కొప్పుల విజయ్ కుమార్



కడప ఆగస్టు 30 కదిలించే వార్త

నందలూరు కోర్టు పరిధిలో నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ న్యాయవాది వి. వినయ్ కుమార్ ను ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి జాతీయ చైర్మన్, న్యాయవాది కొప్పుల విజయ్ కుమార్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. నేషనల్ బోర్డు డైరెక్టర్ కె. రవి బాబుతో కలిసి నూతన ఏజీపీకి పూలబోకే అందజేసి, శాలువాతో కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ... వినయ్ కుమార్ న్యాయవాదిగా వృత్తి చేపట్టిన అతి తక్కువ కాలంలోనే తన ప్రతిభతో ఉన్నతమైన ప్రభుత్వ హోదాను సాధించడం అభినందనీయమన్నారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణలో, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంలో ఏజీపీగా ఆయన విజయవంతమైన సేవలు అందిస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాయి, న్యాయవాదులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో స్థానికులకు ప్రత్యేక గ్యాలరీలు,

### -రోజూ గంటసేపు ఉచిత దర్శనం కల్పించాలి

### -టిటిడి యాజమాన్యానికి కన్వీనర్ గిరిధర్ కుమార్

తిరుపతి కదిలించే వార్త 30 ఆగస్టు



తిరుపతి స్థానికుల విజ్ఞప్తి-కుప్పాల గిరిధర్ కుమార్‌కన్వీనర్, బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితిశ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రమైన తిరుమల మాడ వీధులతో తిరుమల, తిరుపతి స్థానికులకు తరతరాల అనుబంధం ఉంది. తిరుమల మాస్టర్ ప్లాన్ విస్తరణలో భాగంగా ఒకప్పుడు ఎంతో ప్రాశస్త్యం పొందిన గొల్ల కృష్ణయ్య సందు, సన్నిధి వీధి, తీర్థకట్ట వీధి, పూటకూళ్ల మిట్ట తదితర ప్రాంతాల స్థానిక నివాసితులను అక్కడి నుండి వేరే ప్రాంతాలకు తరలించారు. గతంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో మాడ వీధుల్లో శ్రీవారి వాహన సేవలకు స్థానికులే స్వయంగా రంగురంగుల ముగ్గులు వేసి, స్వామివారికి ఘనంగా సేవ చేసుకునేవారు. అంతేకాకుండా స్వామివారి సేవలో భాగంగా స్థానికులే స్వచ్ఛందంగా అన్నప్రసాద వితరణలు జరిపేవారు. తిరుమల అభివృద్ధి కోసం తమ ఇళ్లను, పూర్వీకుల ప్రాంతాలను వదులుకున్న స్థానికుల సంక్షేమాన్ని, సేవలను టిటిడి గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కుప్పాల గిరిధర్ కుమార్ తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్ర వికాసంలో తిరుమల, తిరుపతి స్థానికుల త్యాగాలు, సేవలు అనన్యమైనవి. పూర్వం శ్రీవారి మెట్టు మార్గం గుండా రోజూ పాలు, బియ్యం, కూరగాయలు మోసుకెళ్లడం నుంచి, డోలీలు, కావడిలు మోయడం వరకు స్థానికులే శ్రీవారి సేవలో కీలక పాత్ర పోషించారు. ఈనాటికీ తిరుపతిలోని ప్రతి పౌరుడు, టాక్సీ/ఆటో డ్రైవర్లు, హోమ్‌స్టే నిర్వాహకులు, వ్యాపారులు ప్రతి ఒక్కరూ భక్తులకు మార్గదర్శకులుగా ఉంటూ "శ్రీవారి సేవకులు"గానే వ్యవహరిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక గ్యాలరీలువార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో మాడ వీధుల్లో స్థానికులు స్వామివారి వాహన సేవలను తిలకించడానికి వీలుగా కొన్ని గ్యాలరీలను ప్రత్యేకంగా కేటాయించాలి. దైవదర్శనంలో ప్రాధాన్యత: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వారణాసి .కాశీ, పూరీ జగన్నాథ్, షిరిడీ దేవాలయాలలో స్థానిక భక్తులకు కల్పిస్తున్న ప్రత్యేక దర్శన విధానాల తరహాలోనే, తిరుమలలో కూడా తిరుమల-తిరుపతి స్థానికులకు ప్రతిరోజూ 1 గంట సేపు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించాలి. అడిషనల్ ఈవో ఆఫీసును తిరుపతికి మార్చడం వల్ల తిరుమలలో పర్యావరణ ఒత్తిడి తగ్గుతుంది. దర్శనానికి పత్రాలు సమర్పించే భక్తులు ముందురోజే తిరుమలకు వెళ్లే అవసరం లేకుండా తిరుపతిలోనే బస చేస్తారు. స్థానికులకు, శ్రీవారి సేవకులకు పిలుపు:మన న్యాయమైన కోరికలను రాష్ట్ర కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి, టిటిడి యాజమాన్యానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు చేరవేసేందుకు స్థానికులందరూ విరివిగా స్పందించాలి. సోషల్ మీడియా వేదికలైన (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా పోస్ట్‌లు చేస్తూ, అలాగే లెటర్లు, పోస్ట్ కార్డుల రూపంలో వినతిపత్రాలు పంపుతూ ఈ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నాముతిరుమల పునీత నిర్మాణంలో తమ త్యాగాలను, స్వామివారి సేవలో ఉన్న అనుబంధాన్ని పరిగణనలోకి తీసుకుని, టిటిడి అధికారులు మరియు పాలకమండలి తక్షణమే స్పందించి స్థానికులకు ఈ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాము. కుప్పాల గిరిధర్ కుమార్ కన్వీనర్, సమితి సభ్యులు పాల్గొన్నారు

## ఆరోగ్యమే మహా భాగ్యం... చిన్నతనం నుండే విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి.కమిషనర్ ఎం. జయకృష్ణ.

తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 30 ఆగస్టు

తిరుపతిలోప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని, చిన్నతనం నుండే విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ, అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియం లో రెండు రోజులపాటు "ప్రివెంటివ్ హెల్త్ కేర్ అండ్ డిజిటల్ వెల్‌నెస్" అంశంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేచురోపతి ద్వారా వ్యాధులను నివారించడం, డిజిటల్ యుగంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "ఆరోగ్యమే మహాభాగ్యం" అని తెలిపారు. నేటి యువత మొబైల్, ల్యాప్‌టాప్ లకు అతుక్కుపోయి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, దీనిని నివారించేందుకు యోగా, ప్రకృతి వైద్యం, సరైన జీవనశైలి ఎంతో అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాకరమైన జీవితం ప్రతి ఒక్కరికీ అందించాలనే సదుద్దేశ్యంతో ఇటువంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రెండు రోజులపాటు తిరుపతిలో సత్యనారాయణ రాజు నిర్వహించడం మనందరికీ ఎంతో ఆనందకరమని తెలిపారు. విద్యతో పాటు చిన్నతనం నుండి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే యువ భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఆరోగ్యాకరమైన సందేశాన్ని





ఇంటింటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ అధికారులు, వైద్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఎంజీఎం ఆసుపత్రి హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు సాదర స్వాగతం

తిరుపతి రూరల్ కదిలించే వార్త 30 ఆగస్టు

తిరుపతి జిల్లా రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆదివారం తొట్టంబేడు మండలం సి.ఆర్.ఎన్. కండ్రిగ గ్రామంలోని ఎంజీఎం ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సాదర స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సి.ఆర్.ఎన్. కండ్రిగలోని సి.సి.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో జరిగే వివాహ మహోత్సవ కార్యక్రమానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, తిరుపతి నగరూ సంస్థ కమిషనర్ జయకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ సాయి, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు



ముఖ్యమంత్రికి సాదర స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద అవసరమైన భద్రతా, ప్రోటోకాల్ ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.

## కడప కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌దే విజయం:

### -బండి జకరయ్య

కడప, ఆగస్టు 29: కదిలించే వార్తప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, రాబోయే కడప కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కడప అసెంబ్లీ కాంగ్రెస్ కోఆర్డినేటర్ బండి జకరయ్య అన్నారు. డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి ఆదేశాల మేరకు 43వ డివిజన్ కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమావేశం రవీంద్రనగర్‌లోని గంగమ్మ ఆలయం సమీపంలో జరిగింది. దినకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి బండి జకరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 43వ డివిజన్‌లో వీధి దీపాలు, డ్రైనేజీ, చెత్త సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కడప నగర అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ నిరంతరం పోరాడుతోందని, నగరంలో పార్టీకి ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. దినకర్ మాట్లాడుతూ లా కాలేజ్ వంతెన నిర్మాణం, డ్రైనేజీ సమస్య పరిష్కారం, బుగ్గవంక వరద రక్షణ గోడ పూర్తి చేయడంతో పాటు డివిజన్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## కడప జిల్లా దళిత చైతన్య మహాసభ

### -హలో దళిత చలో కడప

### - జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వి ఆర్ శంకర్

కడప ఆగస్టు 30 కదిలించే వార్త

జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం జిల్లా కమిటి అధ్వర్యంలో కడప జిల్లా దళిత చైతన్య మహాసభ హలో దళిత చలో కడప సమావేశాన్ని జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వి ఆర్ శంకర్ నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా కడప నగరం ప్రెస్ క్లబ్ నందు సభ అధ్యక్షుడిగా వ్యవస్థాపకఅధ్యక్షుడు వి.ఆర్.శంకర్ మాట్లాడుతూ కడప జిల్లా అన్నమయ్యా జిల్లా లల్లో ఉన్న ఎస్సీ ,ఎస్టీ , బిసి కులాలకు చెందిన పేదవారికి భూపంపిణి కొరకు కొన్నిమంలాల్లో మండల తహశీల్దార్ కు అర్హుల జాబితాలు తయారుచేసి వారి వారి రెవెన్యూ డివిజన్అధికార్లు కి జిల్లా యంత్రాంగం కి సమగ్ర సమాచారాలుపంపియున్నారు. కొన్ని మండలాల్లో ఎంక్వేరీలు జరుగుచున్నవి. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని, ఖాజీపేట, చెన్నూరు, సి.కె. దిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు,కమలాపురం, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలు ఎంక్వయిరీలు చేసి అర్హుల జాబితాలను కడప ఆర్.డి.ఓ.కి కలెక్టర్ కి పంపియున్నారు. అసైన్మెంట్ మీటింగ్ కొరకు జిల్లా కలెక్టర్ మన సంఘం తరుపున గవర్నమెంటు వారికి లెటర్ రూపంలో పంపడం జరిగినది. తొందరగా అసైన్మెంట్ జరిపి భూములు లేని నిరుపేదలకు భూపంపిణి చేయాలని కోరాము. దళితులకు 50 సం॥లకు పెన్షన్ ఇవ్వాలి, డిమాండ్స్3 సం॥లకు ఒకసారి అసైన్మెంట్ మీటింగ్లు జరిపి జిల్లాలోని పేద దళితులకు వ్యవసాయభూపంపిణి చేయాలన్నారు.




దళిత నిరుద్యోగులకు ఉద్యోగం లేదా సొంత వ్యాపారాల కొరకు లోన్లు ప్రవేశపెట్టాలి. ఈ కార్యక్రమం లో అవ్వారు. మల్లికార్జున. ఎస్వి రమణ, వై ప్రతాప్ రెడ్డి, పివి రమణ, వై మల్లేష్, బాల వీరప్ప, గాలివీడు నాగేశ్వరరావు, పెండ్లి మరి మల్లేష్, కమలాపురం లక్ష్మీదేవి, సిద్ధవటం రాజేశ్వరి, ఒంటిమిట్ట చంద్ర, చెన్నూరు నాగలక్ష్మి, సికెదిన్నె లక్ష్మీనారాయణ, సంతోషమ్మ కాజీపేట గుర్రమ్మ, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బంగారం ధరలపై భారీ ఊరట.. ఈ వారం మరింత పతనమయ్యే ఛాన్స్.. కొనేవారికి ఇదే మంచి ఛాన్స్..

బంగారం ధరలపై ఊరట. పెళ్లిళ్ల సీజన్ క్రమంలో ధరలు పడిపోతూ కొనుగోలు చేసేవారికి ఊరట కల్గిస్తున్నాయి. గత వారంలో ధరలు భారీగా కుప్పకూలాయి. అయితే ఈ వారంలో కూడా మరింత కుప్పకూలే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా డాలర్ రోజురోజుకి బలపడుతూ రావడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

బంగారం కొనుగోలు చేసేవారికి గుడ్ న్యూస్. గోల్డ్ రేట్లు భారీగా పతనమవుతున్నాయి. గత వారంలో భారీగా కుప్పకూలాయి. అంతకముందు వారంలో భారీగా పెరగ్గా.. గత వారంలో పడిపోతూ వచ్చాయి. అంతర్జాతీయ పరిణామాల క్రమంలో పసిడి ధరల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా డాలర్ బలపడటం, లాభాల స్వీకరణ, యూఎస్ ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రెట్లపై అంచనాల క్రమంలో గోల్డ్ రేట్లు క్రాష్ అవుతూ వస్తోన్నాయి. అయితే ఈ పతనం ఎంతకాలం కొనసాగుతుందనేది చెప్పలేమని నిపుణులు చెబుతున్నారు. బంగారం ధరలు ఇటీవల భారీగా పెరగడంతో తమ వద్ద ఉన్న బంగారాన్ని విక్రయించి పెట్టుబడిదారులు లాభాలు పొందారు. అమ్మకాల ఒత్తిడి పెరగడంతో గోల్డ్ రేట్లు దిగజారుతున్నాయి.

ఎంత తగ్గాయంటే..?

ఆగస్ట్ 24వ తేదీన దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,63,450 వద్ద ప్రారంభమవ్వగా.. ఆగస్ట్ 30 నాటికి రూ.1,56,800కి చేరుకుంది. కేవలం ఆరు రోజుల్లో రూ.6,650 తగ్గింది. మొత్తం 4.07 శాతం మేర క్షీణించింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు కూడా ఇదే బాటలో నడుస్తోంది. ఆగస్ట్ 30న 22 క్యారెట్ల రేటు రూ.1,43,730 వద్ద కొనసాగుతోంది. ఇక బంగారంతో పాటు వెండి ధరలు కూడా పెరుగుతున్నాయి. ఆగస్ట్ 24వ తేదీన కిలో వెండి ధర రూ.2,45,200గా ఉండగా.. ఆగస్ట్ 30 నాటికి రూ.2,42,120కి పడిపోయింది. ఆరు రోజుల్లోనే రూ.3080 తగ్గిందని చెప్పవచ్చు. డాలర్ బలపడటం, మార్కెట్లో హెచ్చుతగ్గుల వల్ల వెండి కూడా ప్రభావితం అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

బంగారం ధర మరింత తగ్గుతుందా..?

అయితే ఈ వారంలో బంగారం మరింత తగ్గే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డాలర్ మళ్లీ పుంజుకోవడమే ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. ద్రవ్యోల్బణాన్ని అడ్డుకునేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ చీఫ్ ప్రకటన చేశారు. యూఎస్ వడ్డీ రేట్ల పెరగవచ్చనే ప్రచారం సాగుతోంది. దీంతో డాలర్, యూఎస్ బాండ్లు మరింత పుంజుకోవడంతో పెట్టుబడిదారుల్లో బంగారాన్ని ఆకర్షణ తగ్గింది. దీంతో రానున్న కొద్ది రోజుల పాటు ధరలు మరింత తగ్గవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలను నమ్మడానికి వీల్లేదు. పెట్టుబడి పెట్టేవారు లేదా కొనుగోలు చేసేవారి ఒకసారి విశ్లేషించుకోవాలి. అనంతరం పెట్టుబడిపై నిర్ణయం తీసుకోవాలి. ఆగస్ట్ 30న హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,58,240 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,45,050 వద్ద ట్రేడవుతోంది. ఇక విజయవాడ, విశాఖపట్నంలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2.60 లక్షలుగా ఉంది.

# కమల్ అమృత్ వాణి-243



మాతాపిత్రోః సదా సేవా కర్తవ్యా భక్తిపూర్వకమ్ ।
తయోరాశిషా నిత్యం జీవనం భవతి మంగళమ్॥


తాత్పర్యం.

తల్లిదండ్రులు మన జీవితానికి తొలి గురువులు, తొలి మార్గదర్శకులు.

వారి ప్రేమ, త్యాగం, కష్టం మన ఎదుగుదలకు పునాది.వారి పట్ల గౌరవం చూపడం మన మొదటి బాధ్యత.వారిని ఆదరించడం కేవలం కర్తవ్యం కాదు, మన సంస్కారానికి ప్రతిబింబం.వారి అనుభవం జీవితంలోని ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతుంది.వృద్ధాప్యంలో వారికి అండగా నిలవడం నిజమైన కృతజ్ఞత.తల్లిదండ్రుల ఆశీస్సులు మనసుకు ధైర్యాన్ని, జీవితానికి స్ఫూర్తిని ఇస్తాయి.వారి సేవలోనే కృతజ్ఞత ఉంది; వారి ఆశీస్సుల్లోనే ఉంది బంగారు భవిష్యత్తు.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'







# రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి సాదర వీడ్కోలు..





అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 30 :

– గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ లో జరిగిన మాజీ మంత్రి మరియు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తెకు మరియు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడుల వివాహ వివాహ వేడుకలలో పాల్గొని, అనంతరం శిల్పారామం నందు ఏర్పాటుచేసిన హెలిపాడ్ నుంచి మధ్యాహ్నం 03:29 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి రెసిడెన్స్ కు బయలుదేరి వెళ్లారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి కి రాష్ట్ర ఆర్థిక ఢ ప్రణాళిక, వాణిజ్య పన్నులు



మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బికే.పార్థసారథి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.కేశవరెడ్డి, తదితరులు నగరంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ లో సాదర వీడ్కోలు పలికారు.



## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**- : ఆగస్టు 31వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**

**- : సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..**

**- : రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**

**- : జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం, కలెక్టరేట్ కదిలించే వార్త, ఆగస్టు 30 :

– మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.




### ఆగస్టు 31వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :

– ఆగస్టు 31వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.– ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# అనంతపురంలో పర్యటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..



అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 30 :

– : గుంతకల్లు ఎమ్మెల్యే కుమార్తెకు మరియు ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుమారుడుల వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి.. వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు..– గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలో పర్యటించారు. నగరంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ కు మధ్యాహ్నం 02:59 గంటలకు చేరుకుని.. అక్కడ జరిగిన మాజీ మంత్రి మరియు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తెకు మరియు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడుల వివాహ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీర్వదించి.. వారికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన వధూవరులు, గుంతకల్లు ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ చైర్మన్ కుటుంబ సభ్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రూప్ ఫోటో దిగారు.– రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మరోసారి శుభాకాంక్షలు తెలిపి బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ నుంచి మధ్యాహ్నం 03:10 గంటలకు బయలుదేరి నగరంలోని శిల్పారామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు బయలుదేరి వెళ్లారు.– ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక ఢ ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు



శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.







# హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన నాయకులు




















అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 30 : హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన నాయకులు

